ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
ఎడిటర్ : నాగేంద్ర | పేజీలు : 4 | సంపుటి : 1 - సంచిక 229 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | శుక్రవారం 29- 11 - 2024 | వెల-6



## ఝార్ఖండ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్

**హేమంత్ సోరెన్ అనే నేను**

**ప్రమాణం చేయించిన గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్**

**కార్యక్రమానికి హాజరైన కూటమి నేతలు**

### 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సోరెన్

ఝార్కండ్ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. దీంతో హేమంత్ సోరెన్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఝార?ండ్ రాజధాని రాంచీలోని మొరహాబాద్ మైదానంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

హేమంత్ సోరెన్ నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఈడీ అతనిని అరెస్ట్ చేసింది. సీఎం పదవికి రాజీనామా చేసిన అతను ఐదు నెలల తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం

**గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై రేవంత్ ఆగ్రహం**

**పాఠశాలలు, గురుకులాల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశం**

**పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలన్న రేవంత్**



గురుకుల పాఠశాలల వసతి గృహాల్లో తరచుగా ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు చోటుచేసుకుంటుండటంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, గురుకులాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని అన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని సీఎం చెప్పారు. పౌష్టికాహారాన్ని అందించేందుకు డైట్ ఛార్జీలను కూడా పెంచామని తెలిపారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని హెచ్చరించారు. పదేపదే హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావడం లేదని మండిపడ్డారు.

## రాజ్యసభకు మెగా బ్రదర్ నాగబాబు!

**మోపిదేవి, బీదా మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామాతో మూడు స్థానాలు ఖాళీ**

**వచ్చే నెల 20న ఎన్నికలు.. అదే రోజు ఫలితం**

**ఒక స్థానంలో నాగబాబు ఫిక్స్ అయినట్టు సమాచారం**

**రాజ్యసభ బరిలో వైసీపీ లేనట్టే**

2లో




జనసేన నేత, మెగా బ్రదర్ నాగబాబు త్వరలోనే రాజ్యసభకు వెళ్లబోతున్నారా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది. వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, ఆర్. కృష్ణయ్య వేర్వేరు కారణాలతో రాజీనామా చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. వచ్చే నెలలో ఎన్నికలు జరగనుండగా, జనసేన నుంచి నాగబాబును పెద్దల సభకు పంపాలని నిర్ణయించినట్టు తెలిసింది.



## ఎంపీగా ప్రియాంక ప్రమాణస్వీకారం

**వయనాడ్ ఉపఎన్నికలో ప్రియాంకాగాంధీ ఘన విజయం**

**ప్రియాంకతో ప్రమాణస్వీకారం చేయించిన స్పీకర్ ఓం బిర్లా**

**ఓనం చీరను ధరించి, రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రియాంక ప్రమాణం**

కాంగ్రెస్ ఎంపీగా ప్రియాంకాగాంధీ ప్రమణస్వీకారం చేశారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రియాంక ప్రమాణం చేశారు. కేరళ సంప్రదాయ ఓనం చీరను ధరించి ఆమె పార్లమెంటుకు వచ్చారు. సోదరుడు రాహుల్ గాంధీ ఆమెను పార్లమెంటుకు తోడ్కొని వచ్చారు. ఇటీవల వయనాడ్ లోక్ సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో ప్రియాంక ఘన విజయం సాధించారు. 4.10 లక్షల భారీ మెజార్టీతో ఆమె జయకేతనం ఎగురవేశారు. ఆమెకు మొత్తం 6.22 లక్షల ఓట్లు పడ్డాయి. నాందేడ్ ఉపఎన్నికలో గెలుపొం దిన కాంగ్రెస్ నేత రవీంద్ర వసంతరావ్ చవాన్ కూడా ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారాల కార్యక్ర్మం ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో సభను మధ్యాహ్నం 12 వరకు స్పీకర్ వాయిదా వేశారు. రాజ్యసభ కూడా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది.

## ఢిల్లీలో భారీ పేలుడు కలకలం

**ప్రశాంత్ విహార్‌లోని పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలోని ఓ స్వీట్ షాప్‌లో ఘటన**

**ఈరోజు ఉదయం 11:48 గంటల సమయంలో స్వీట్ షాప్ వద్ద పేలుడు**

**ఘటనాస్థలిలో తెల్లటి పొడి లాంటి పదార్థం దొరికినట్లు పోలీసుల వెల్లడి**




## మాముళ్లతో చెక్!



**కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు దర్జాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా**

**పేరుకు రెండు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నా తనిఖీలు తూతూమంత్రమే**

**రాత్రివేళ తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తోన్న వైనం**

**అటు కొందరు చెక్‌పోస్టు సిబ్బందితో బియ్యం వ్యాపారుల మిలాఖత్**

**చెక్‌పోస్టు సిబ్బందికి ఏ లారీల్లో రేషన్ బియ్యం వస్తుందో ముందే లీకులు**

**చూసీచూడనట్టు వదిలేయడానికి దండిగా మామూళ్ల చదివింపులు**

**చెక్‌పోస్టులు ఏర్పాటైన కొత్తలో ప్రతి లారీలోను రేషన్ ఆనవాళ్లపై తనిఖీలు**

**ఇప్పుడు ఇరవై లారీలకు కనీసం నాలుగింటిలో కూడా తనిఖీలు నిల్**

**రేషన్ అక్రమ రవాణా అరికట్టడానికి కలెక్టర్ ప్రయత్నిస్తున్నా వారిదే పైచేయి**

కాకినాడ నుంచి రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా అవకుండా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్రమార్కులు ఆగడం లేదు. రకరకాల దారుల్లో కళ్లుగప్పి దర్జాగా కోట్ల విలువైన పేదల బియ్యాన్ని సముద్రాలను దాటించేస్తున్నారు. మాఫియా అంతుచూడడానికి ఎన్ని వ్యూహాలు అమలు చేస్తున్నా వాటిని ఎంచక్కా దాటుకుని వెళ్లిపోతున్నారు. చివరకు పేదల బియ్యాన్ని పసిగట్టడానికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు సైతం మాఫియాను ఆపలేకపోతున్నాయి. పోర్టుకు వెళ్లే రేషన్ బియ్యాన్ని పసిగట్టడానికి ఏర్పాటు చేసిన రెండు సమీకృత చెక్‌పోస్టులు పూర్తిగా మొక్కుబడిగా మారాయి. రాత్రివేళ పూర్తిగా తనిఖీలు ఆపేయడం అక్రమార్కులకు బాగా కలిసివస్తోంది.

వివరాలు 2లో

## ఢిల్లీలో భారీ పేలుడు కలకలం

దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ ఉదయం భారీ పేలుడు సంభవించింది. ప్రశాంత్ విహార్ ప్రాంతంలోని పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలోని ఓ స్వీట్ షాప్‌లో ఈ ఘటన జరిగింది. గురువారం ఉదయం 11:48 గంటల సమయంలో స్వీట్ షాప్ వద్ద పేలుడు సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందింది.

దాంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చాయి. ఇక రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ప్రమాద స్థలిలో తెల్లటి పొడి లాంటి పదార్థం దొరికినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, పేలుడు ధాటికి భారీ శబ్దం కారణంగా చుట్టుపక్కల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాజ్యసభకు
## మెగా బ్రదర్ నాగబాబు!

జనసేన నేత, మెగా బ్రదర్ నాగబాబు త్వరలోనే రాజ్యసభకు వెళ్లబోతున్నారా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది. వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, ఆర్. కృష్ణయ్య వేర్వేరు కారణాలతో రాజీనామా చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. వచ్చే నెలలో ఎన్నికలు జరగనుండగా, జనసేన నుంచి నాగబాబును పెద్దల సభకు పంపాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో ఉండగానే ఈ విషయంపై క్లారిటీ వచ్చినట్టు తెలిసింది.

వచ్చే నెల మూడో తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా 10న ముగుస్తుంది. 13 వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. డిసెంబర్ 20న పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, ఏపీలో కూటమి ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో మెజార్టీ ఉండడంతో ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ స్థానాలూ కూటమికి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

ఒక్క అభ్యర్థి రాజ్యసభకు ఎన్నిక కావాలంటే కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. వైసీపీకి ప్రస్తుతం ఉన్నది 11 మందే. ఈ నేపథ్యంలో వైసీపీ ఈ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం దాదాపు లేనట్టే.

## సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

### జిల్లా సైబర్ క్రైమ్ పోలీస్ టీం వారు 1930 టోల్ ఫ్రీ నెంబర్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు

**నంద్యాల క్రైం, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణలో భాగంగా వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి సంస్థ వారు యానిమల్ ఈవెంట్స్ సెలబ్రేషన్ లో భాగంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సుమారు 137 మంది పిల్లలు, వారి యొక్క తల్లిదండ్రులతో పోలీసు ఇన్స్పెక్టర్లు మారుతి శంకర్, ఇస్మాయిల్, వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతిరావు, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు, డాక్టర్ శారద భాయ్ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. నంద్యాల జిల్లా పోలీసు సైబర్ క్రైమ్ టీం ఇన్స్పెక్టర్ మారుతి శంకర్ గారు,2 టౌన్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ రంగములో ప్రస్తుతం ప్రపంచం ముందుకు వెళ్తున్న సంధర్భంలో దీన్ని అదునుగా తీసుకొని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కావున ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. గుర్తు తెలియని మొబైల్ నంబర్స్ నుండి వచ్చే లింకులను క్లిక్ చెయ్యకండి, మీ బ్యాంకు అకౌంట్ లేదా యోనో అకౌంట్ బ్లాకైందని, మీ పాన్‌కార్డు నంబర్,ఆధార్ నంబర్ అప్‌డేట్ చేసుకొనేందుకు ఈ లింక్ క్లిక్ చేయండి' అని సందేశాలు వచ్చినప్పుడు జాగ్రతగా ఉండండి. ప్రత్యేకమైన సందర్భాలను పండుగలను దృష్టిలో పెట్టుకొని ఫ్రీ గిఫ్ట్ అంటూ మెసేజ్ లు వచ్చినప్పుడు ఆశపడి మోసపోవద్దు. మోసపూరిత లోన్ యాప్ ల గురించి,మోసపూరిత ఉద్యోగ ప్రకటనలు మొదలగు మెసేజ్ లో ఉన్న లింక్ ని క్లిక్ చేసి, మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా నంబర్లు, పాస్‌వార్డులు, ఇతర సున్నితమైన సమాచారాన్నిపంచుకోరాదు.ఎవరైనా సైబర్ క్రైమ్ గురైనట్లయితే వెంటనే తమరు 1930కు ఫోన్ సహాయం పొందాలని తెలియజేశారు. అనంతరం నంద్యాల డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ నందు వంద (100)మంది పిల్లలతో సైబర్ క్రైమ్ సంబంధించిన టోల్ ఫ్రీ 1930 నెంబరుపై వివిధ రకాల గొడుగులతో అవగాహన ప్రదర్శన చేయడం జరిగింది.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి.

### ఇంటర్మీడియట్ విద్యార్థులకు డిసెంబర్ 31 వ తేది నాటికి అపార్ కార్డుల జనరేషన్ 100 శాతం పూర్తి చేయాలి.

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

**కర్నూలు, నవంబర్ 28, రిపబ్లిక్ న్యూస్ ::** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్ లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంపు పై ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు..

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు త్రైమాసిక పరీక్షల్లో 37 శాతం మాత్రమే ఉత్తీర్ణత కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు..

ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ పాస్ కావడం వల్ల వారి జీవితాలు మలుపు తిరిగే అవకాశం ఉంటుందన్నారు.. అందువల్ల ప్రిన్సిపల్స్, లెక్చరర్లు మొక్కుబడిగా కాకుండా ప్రొఫెషనల్ గా తీసుకుని విద్యార్థులకు బోధన చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. స్టడీ అవర్లు ఏర్పాటు చేసి, షెడ్యూల్ రూపొందించుకుని అన్ని సబ్జెక్టు లు బోధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..ఇప్పుడు ఉన్న తరంలో విద్యార్థులకు ఐక్యూ లెవెల్ చాలా ఎక్కువగా ఉందని, ఏదైనా సులభం గా అర్థం చేసుకునే సామర్థ్యం ఉందని, వారికి సరిగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్తే కచ్చితంగా పాస్ అవుతారని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. ప్రిన్సిపల్స్ యాక్టివ్ గా ఉండాలన్నారు..రేపే లెక్చరర్లతో ఈ అంశంపై సమీక్షించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని అమలు చేయాలన్నారు..పాస్ పర్సంటేజ్ తగ్గితే ప్రిన్సిపల్స్, లెక్చరర్లు బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు..

ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందవరం లో 84 శాతం పాస్ ఉత్తీర్ణత సాధించినప్పుడు.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎమ్మిగనూరు, ఓర్వకల్లు, బి.క్యాంప్ కర్నూలు, మంత్రాలయం లలో తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడం ఏంటని కలెక్టర్ సంబంధిత మండలాల ప్రిన్సిపల్ లను ప్రశ్నించారు..కళాశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఎంతమంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు? ఏ సబ్జెక్టు లో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు? అన్న విషయాల పై విశ్లేషణ చేశారా?? రానున్న అర్థ వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణత ఏ విధంగా పెంచాలనే అంశంపై ఏదైనా యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నారా? అని కలెక్టర్ సంబంధిత ప్రిన్సిపల్ లను అడిగి తెలుసుకున్నారు.. డిసెంబర్ నెల 17 నుండి అర్థ వార్షిక పరీక్షల ఫలితాల్లో పురోగతి కచ్చితంగా కనపడాలన్నారు... ఏ సబ్జెక్టు లో ఐతే ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారో సంబంధిత లెక్చరర్ ను వివరణ కోరతామని కలెక్టర్ పేర్కొన్నారు..

18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయన్నారు.. పత్తికొండ, కోసిగి, ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 30 శాతం పాస్ ఉత్తీర్ణత సాధించాయని, రానున్న అర్థ వార్షిక పరీక్షలలో వంద శాతం పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు..

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరమేశ్వర రెడ్డి, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపల్ లు పాల్గొన్నారు.

## మామూళ్లతో చెక్!

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం మాఫియా వైసీపీ అయిదేళ్ల పాలనలో పేట్రేగిపోయింది. స్వయంగా కాకి నాడ వైసీపీ కీలక నేత కుటుంబం ఈ వ్యాపారంలో ఎన్నో ఏళ్లుగా పాతుకుపోవడంతో యథేచ్ఛగా బియ్యా న్ని విదేశాలను దాటించేస్తోంది. ఈయన అనుచరుల మిల్లుల్లో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం తెచ్చి పాలిష్ చేసి విదేశాలకు ఏ తనిఖీలు లేకుండా తరలించేస్తూ వందల కోట్లలో సంపాదించారు. గత సర్కారు తమ కనుసన్నల్లోనే ఉండడంతో అధికార వ్యవస్థలన్నీ వీరికి సలాం కొట్టాయి. దీంతో ప్రభుత్వం కిలో రూ.44కు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని రూ.12కు నల్ల మా ర్కెట్‌లో కొనుగోలుచేసి పాలిష్ చేసి వేరే బ్రాండ్ పేరు తో విదేశాలకు అడ్డగోలుగా తరలించేశారు. ఇదిచాలక సదరు నేత విదేశాల్లో గోదాములు కట్టి బియ్యం నిల్వ లు కూడా చేస్తున్నారు. ఇలా కొన్ని వందల కోట్ల విలు వైన రేషన్‌బియ్యం గడచిన కొన్నేళ్లలో కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగిరిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ బియ్యం ఎగు మతిపై ఉక్కుపాదం మోపింది. అప్పటికే గోదాముల్లో ఉన్న రేషన్‌బియ్యం నిల్వలపై పౌరసరఫరాలశాఖ మం త్రి నాదెండ్ల స్వయంగా తనిఖీలు చేశారు. ఆయన ఆదే శాలతో జిల్లాలో అనేక గోదాముల్లో అధికారులు తని ఖీలు చేశారు. మొత్తం రూ.215 కోట్ల విలువైన 51,427 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ల్యాబ్‌కు పంపిన శాంపిళ్లలో 12,184 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ బియ్యంగా నిర్ధారించారు. ఈనేపథ్యంలో రేషన్ మాఫియాను అరికట్టడం కోసం కాకినాడపోర్టుకు వెళ్లే దారిలో రెండుచోట్ల సమీకృత చెక్‌పోస్టులను ఏర్పా టుచేయాలని కలెక్టర్ శాన్‌మోహన్ నిర్ణయం తీసుకు న్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో వీటిని పనిచేసేలా రెవె న్యూ, పౌరసరఫరాలశాఖ, పోలీసు సిబ్బందిని నియ మించారు. పోర్టుకు బియ్యం లోడుతో వెళ్లే ప్రతిలారీని తనిఖీ చేసి రేషన్‌బియ్యం ఆనవాళ్లు గుర్తించాలని ఆదే శించారు. దీంతో రేషన్‌బియ్యం విదేశాలకు అక్రమంగా తరలడం ఆగుతుందని అంతా భావించారు.

**చెక్‌పోస్టులకు అవినీతి చెదలు...**

పోర్టుకు వెళ్లే దారిలో బొంబాయి కాటా, శక్తిగ్యాస్ సెంటర్ వద్ద ప్రభుత్వం ఆగస్టులో రెండు సమీకృత చెక్‌పోస్టులను ఏర్పాటుచేసింది. ఇందులో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, పోర్టు, పోలీసు తదితర విభాగాలతో కూడిన సిబ్బందిని నియమించి రోజుకు మూడు షిఫ్టుల్లో దాదాపు 1,100 లారీలను ఈ చెక్ పోస్టుల్లో తనిఖీలు చేసేవారు. పోర్టులోపలకు బియ్యం లోడుతో వెళ్లే ప్రతి లారీ నుంచి బియ్యం శాంపిళ్లను తీసుకుని అక్కడికక్కడ ప్రత్యేక రసాయనం ద్వారా రేషన్‌బియ్యం ఎగుమతి అవుతున్నాయో లేదో తనిఖీ చేసేవారు. అయితే ఈ చెక్‌పోస్టులవల్ల బియ్యం ఎగుమతులు ఆలస్యమవుతున్నాయంటూ అప్పట్లో వ్యాపారులు ఆందోళన చేయించారు. దీంతో అప్పటినుంచీ ఇవి నామ్‌కే వాస్తుగా తయారయ్యాయి. మూడు పూటలా పనిచేసే చెక్‌పోస్టులు రాత్రివేళల్లో తనిఖీలు చేయించడం నిలి పివేయించారు. దీంతో ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకే రెండు షిఫ్టుల్లో ఇవి పనిచేస్తున్నాయి. దీంతో రాత్రివేళ లారీల్లో బియ్యం తనిఖీలు ఆగిపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. వందలాది లారీలు ఎంచక్కా అర్ధరాత్రి వేళ గుట్టుగా పోర్టులోకి వెళ్లిపోతున్నాయి. ఇందులో రేషన్ బియ్యం ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. మరోపక్క చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన కొత్తలో ప్రతి లారీని తనిఖీ చేసి శాంపిళ్లు తీసుకునే వారు. కానీ ఇప్పుడు ఇరవై లారీలు పోర్టులోకి వెళ్తే అం దులో రెండు లేదా మూడు లారీలనే తనిఖీచేసి పంపే స్తున్నారు. దీంతో అక్రమార్కులకు పని సులువయింది. ఇదంతా ఒకెత్తయితే చెక్‌పోస్టుల్లో మొదట్లో ఉన్న సిబ్బంది హడావుడి పూర్తిగా పోయింది. అధికారులు కూడా సిబ్బందిని కుదించి ఇప్పుడు కేవలం ముగ్గురినే కొనసాగిస్తున్నారు. ఇందులో ఒకరు వీఆర్వో, మరొకరు పౌరసరఫరాలశాఖకు చెందిన సీఎస్‌డీటీ, మరొకరు టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటున్నారు. అయితే ఏ చెక్‌పోస్టులో ఎవరు విధిలో ఉంటున్నారో వారి ఫోన్ నెంబర్లతో సహా ఏకంగా బియ్యం ఎగుమతిదారుల చేతి కి నిమిషాల్లో వచ్చేస్తోంది. దీంతో సదరు సిబ్బందితో అక్రమార్కులు కుమ్మక్కైపోతున్నారు. తమవి పది లారీలు వస్తున్నాయంటూ ముందే కొందరు చెక్‌పోస్టు సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. ఇందుకు భారీ గానే మామూళ్లు తడుపుతున్నారు. దీంతో వీటిని దర్జా గా లోపలకు పంపేస్తున్నారు. దీంతో ఇక్కడ డ్యూటీ కోసం పోటీ కూడా నెలకొంది. మరోపక్క ఈ మామూ ళ్లలో కొంత పౌరసరఫరాలశాఖ కీలక అధికారి స్థాయి వరకు అందుతున్నాయి. ఇదంతా ఒకెత్తయితే రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ ఎగుమతి విషయంలో ఇప్పటికీ జిల్లా పౌరసరఫరాలశాఖలో కొందరు సిబ్బంది నుంచి పూర్తి సహకారం అందుతోంది. ఈ శాఖ కీలక అధికారి గత ప్రభుత్వంలో నియమితులవడంతో అక్రమార్కుల విషయంలో గట్టిగా వ్యవహరించ లేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## రాష్ట్రంలోనే ప్రప్రథమంగా పదవ తరగతి విద్యార్థుల బోధనకు వర్చువల్ క్లాస్ రూం ఏర్పాటు.

### జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూం ట్రయల్ రన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

**కర్నూలు, నవంబర్ 28, రిపబ్లిక్ న్యూస్ ::**

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా వర్చువల్ క్లాస్ రూం ద్వారా జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులకు బోధనా తరగతులు ప్రారంభం కానున్నాయి..

గురువారం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూం ట్రయల్ రన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు..ఈ సందర్భంగా అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాల ల విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్చువల్ విధానం ద్వారా పాఠశాలలలోని 10 వ తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందించబోతున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరికరాలతో జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఒక స్టూడియోను ఏర్పాటు చేశామని తెలిపారు..జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు..ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు..త్వరలో అన్ని పాఠశాలలకు కనెక్ట్ అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన 42 మంది అనుభవజ్ఞులైన టీచర్లు వర్చువల్ విధానం ద్వారా బోధన అందించేందుకు ముందుకు వచ్చారని కలెక్టర్ తెలిపారు..విద్యార్థులు టీచర్లతో ఇంటరాక్ట్ అయ్యే సౌకర్యం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.. స్టూడియో ద్వారా పాఠశాలలకు ప్రత్యక్ష ప్రసారం చేసేటప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా పిల్లలకు స్పష్టంగా కనిపించేలా ఇంటర్నెట్ కనెక్షన్ వేగాన్ని పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



**డిసెంబర్ 7 వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ ను పండుగలా జరపాలి: జిల్లా కలెక్టర్.**

జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ డిసెంబర్ 7 వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఒక పండుగలా జరపాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.. విద్యార్థుల ప్రగతి తెలుసుకోడానికి ఈ కార్యక్రమం ద్వారా వీలు కలుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.. డిసెంబర్ 7వ తారీఖున జరగబోయే మెగా పేరెంట్స్ డే కు సంబంధించిన పాటలను రికార్డ్ చేస్తున్న రికార్డు రూమును కలెక్టర్ సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. శ్యామ్యూల్ పాల్, ఇతర విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి.

### వారపు లక్ష్యం శత శాతం పూర్తి కావాలి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**నంద్యాల ప్రతినిధి , నవంబరు 28, రిపబ్లిక్ న్యూస్ ::**

జిల్లాలో ప్రారంభించిన సిసి రోడ్ల నిర్మాణ పనుల పూర్తికి నాలుగు వారాలు మాత్రమే సమయం ఉందని నాణ్యత ప్రమాణాలు పాటించి మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసి రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఈఈలు నాగరాజు, రఘురామిరెడ్డి, డిఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 1026 సిసి రోడ్ల నిర్మాణానికి గాను 255 రోడ్లు పూర్తి అయ్యాయని మిగిలిన 771 సీసీ రోడ్ల లక్ష్యాన్ని నాలుగు వారాలుగా విభజించుకొని వారపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 240 రోడ్లకు గాను 41 పూర్తయ్యాయని నిర్మాణంలో ఉన్న199 రోడ్లను డిసెంబర్ చివరి నాటికి క్యూరింగ్ తో సహా పూర్తి కావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల నియోజకవర్గంలో 103 రోడ్లకు గాను 27 పూర్తయ్యాయని మిగిలిన 76 రోడ్లు, పాణ్యం నియోజకవర్గంలో 71 రోడ్లకు గాను 15 పూర్తయ్యాయని మిగిలిన 56 రోడ్లు, శ్రీశైలం నియోజకవర్గంలో 165 రోడ్లకు గాను 57 పూర్తయ్యాయని మిగిలిన 108 రోడ్లు, బనగానపల్లి నియోజకవర్గంలో 147 రోడ్లకు గాను 33 పూర్తయ్యాయని మిగిలిన 114 రోడ్లు, డోన్ నియోజకవర్గంలో 64 రోడ్లకు గాను 27 పూర్తయ్యాయని మిగిలిన 37 రోడ్లు, నందికొట్కూరు నియోజకవర్గంలో 236 రోడ్లకు గాను 55 పూర్తయ్యాయని మిగిలిన 181 రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని సంబంధిత ఏఈ, డీఈలను కలెక్టర్ ఆదేశించారు. గతవారం 158 సిసి రోడ్ల నిర్మాణాల లక్ష్యానికి గాను 123 పూర్తి చేశారని... ఈ వారం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సిమెంట్, ఇసుక అందుబాటులో ఉండి చేయడానికి ఇబ్బంది ఏంటని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారు లను ప్రశ్నించారు. పూర్తయిన రోడ్లను 21 రోజులకు తక్కువ గాకుండా క్యూరింగ్ చేయాల న్నారు. నిర్దేశించిన రోడ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



## తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి.



**మాస్టర్ ప్లాన్ కు అవసరమయ్యే నివేదికలు ఇవ్వండి.**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**నంద్యాల ప్రతినిధి, నవంబర్ 28, రిపబ్లిక్ న్యూస్ ::**

తిరుమల క్షేత్ర తరహాలోనే శ్రీశైల మహా క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఆత్మకూరు డిఎఫ్ఓ సాయిబాబా, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, సర్వే ల్యాండ్ ఏడి జయరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం మహా క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన దేవాదాయ, పర్యాటక, ఆర్ అండ్ బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారన్నారు. ఈ మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శు క్రవారం సాయంత్రంలోగా అందజేయాలని దేవాదాయ, అటవీ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాబోయే రెండు సంవత్సరాలలో శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల క్షేత్ర తరహాలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. గతంలో దేవాదాయ, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలని సర్వే అండ్ ల్యాండ్స్ ఏడి ఆదేశించారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అటవీ విస్తీర్ణం, అటవీ సరిహద్దుల సర్వే, గజిట్ నోటిఫికేషన్, నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల నిషేధిత భూములు సంబంధిత వివరాలతో నివేదికలు అందజేయాలని డిఎఫ్ఓ ను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైల దేవస్థానం ఆధీనంలో ఉన్న భూములు, అటవీ సరిహద్దుల నుండి రక్షణ గోడలు, తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను అందజేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో మంత్రుల కమిటీ సూచించిన అంశాలు, తయారు చేసిన నివేదికలను కూడా అందచేయాలన్నారు. సున్నిపెంట నుండి శ్రీశైలం వరకు 2.5 కిలోమీటర్ల ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు, రహదారి విస్తరణ సంబంధించిన పనులు కూడా మాస్టర్ ప్లాన్ నివేదికలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.

# సాంఘిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే:-ప్రజా సంఘాల నాయకులు

## పాములపాడులో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు.

**పాములపాడు నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్):-** పాములపాడు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాల నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు బీసీల జాతీయ కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు, జాతీయ బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్. గోపాల్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గట్టు.శంకర్ గౌడ్, బీసీ సంఘం యువజన నాయకుడు రాయపాటి. మురళీమోహన్, జాతీయ మలమానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల.అబ్రహం, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ లింగాల.స్వాములు, తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ

భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆయన మహారాష్ట్ర రాష్ట్రంలోని, పూణేలో 1827 ఏప్రిల్ 11న అట్టడుగు వర్గంలో జన్మించే నాటికి మనువాద ధర్మం నాలుగు పాదాల నడుస్తోందని, కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న అస్పృశ్యులలాగే సమాజంలో పురుషులకు సమానంగా ఏమాత్రం అవకాశాలు పంచుకునే పరిస్థితి స్త్రీలకు లేదని, ముఖ్యంగా బాలికలు పాఠశాలలకు వెళ్లి చదువుకోవడం తప్పుగా భావించేవారని, అటువంటి పరిస్థితులను మార్చాలని పూలే నడుంబిగించారన్నారు. మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించడానికి నాటి మనువాద సమాజం జీర్ణించుకోలేకపోయింది పూలే తండ్రికి ఊళ్లోని వారందరూ ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో సొంత తండ్రి అప్పటికే పెళ్లయిన పూలేను ఇంటి నుంచి వెళ్లగొట్టాడన్నారు. స్త్రీల విద్యను ముందు తన ఇంటి నుంచి ప్రారంభించారాన్నారు. పూలే నిరక్షరాస్తురాలైన తన భార్య సావిత్రిబాయికి తానే చదువు నేర్పి ఆమెను ఒక ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారన్నారు. మతం ద్వారా తాము ఎంత మోసానికి గురవుతున్నారో బడుగు వర్గాలకు తెలియ చెప్పడానికి తృతీయ రత్న వంటి నాటకాలు పెక్కు కవితలు రాశారన్నారు. ఆయన రాసిన గులాం గిరి వంటి గ్రంథాలు సమకాలీన సమాజపు పోకడలకు అద్దం పట్టాయనీ, ఎందరికో దిశా నిర్దేశం చేశాయన్నారు. వితంతువులకు అనాధ మహిళలకు, అనాధ బాలలకు, శిశువులకు శరణాలయాలు స్థాపించారన్నారు. పూలే దంపతులు బడుగు, బలహీనవర్గాల విజ్ఞాన వికాసాల కోసం సత్యశోధక్ సమాజ్ వంటి సంస్థలు స్థాపించారన్నారు. కార్మిక ఉద్యమ పితామహుడైన లోకండే ఆయనకు ప్రధాన అనుచరుడు అన్నారు. కార్మికులకే కాక, కర్షకుల ఉన్నతికి కూడా ఎన్నో రచనలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని వారి సమస్యల వైపునకు మళ్ళించడంలో పూలే విజయం సాధించారన్నారు. పూలేను బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక ఆదర్శమూర్తిగా గురువుగా పేర్కొని గౌరవించేవారన్నారు. నేటి యువత విద్యార్థులు పూలే జీవిత చరిత్రను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులతో ఘనంగా







వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణ మోహన్ యాదవ్, సురేష్ యాదవ్, జి. శంకర్ గౌడ్, వేణు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, సాంబశివుడు, సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్-ఎస్. షర్ఫుద్దీన్ అలి, నాయకులు ఎం.జాన్ బాబు, ముద్రగడ శ్రీనివాసరావు, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.ల

# ఆయన అందరికీ ఆదర్శం

## 82 నెలలుగా అవ్వకు అండగా మానవత్వం చాటుకున్న డాక్టర్ గంగన్న ప్రతి నెల 1000 రూపాయలు సమకూరుస్తున్న గ్రంథాలయ అధ్యాపకులు

**ఆళ్లగడ్డ నవంబర్ 28( రిపబ్లిక్ న్యూస్ )** బంధాలు అనుబంధాలకు రక్త సంబంధాలకు విలువ కట్టె సమాజంలో ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకుంటే ఏ ఆదరణకు నోచుకోని నిరాశ్రయులకు వృద్ధులకు లోటుండదని పలువురు సమాజ సేవకుడు, ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాల లైబ్రరీ అధ్యాపకులు, డాక్టర్ గంగన్న చేస్తున్న సేవలను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేస్తున్న సంఘటన ఆళ్లగడ్డ నియోజకవర్గ కేంద్రంలో సంతరించుకుంది.ఈయన వృత్తి ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధ్యాపకులు.

స్థానిక అళ్ళగడ్డ మండలంలోని ఓబులం పల్లె గ్రామ కాపురాస్తురాలిన షేక్ హుస్సేన్ బి 40 సంవత్సరాల క్రితం భర్తను మరియు బిడ్డను పోగొట్టుకొని నిలువ నీడ లేక తనకంటూ ఏ ఉపాధి అవకాశాలు లేక పూట కూడా గడవని స్థితిలో ఉన్నటువంటి ఆమెకు ఆళ్లగడ్డ పట్టణంలోని గ్రంథాలయ అధ్యాపకులు,వైస్ ప్రిన్సిపల్ గారైనటువంటి డా : గంగన్న మరో సారి మానవతా దృక్పథం చాటుకున్నారు నేను నా కుటుంబం నా డబ్బు అని అనుకునే ఈ సమాజంలో జీవితం మీద ఆశలు వదులుకున్నటువంటి షైక్ హుస్సేన్ బి కి నిర్విరామంగాఅందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అనే నినాదంతో గత 82 నెలలుగా తన సొంత డబ్బును ఇచ్చిన మాటను నెరవేర్చుకోవాలని సంకల్పంతో ప్రతి నెల 1000 రూపాయలు ఇవ్వడమే కాక నిత్యవసర వస్తువులు కూడా తనకు సమకూరుస్తూ తనకు పెద్ద దిక్కుగా ఉన్నటువంటి గంగన్న కుటుంబాన్నిఆ దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తూ భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, అలాగే ఆయనను పలువురు ఆదర్శంగా తీసుకొని నిరాశరీలకు అండగా నిలవాలన్నారు

# వ్యవసాయాభివృద్ధి కోసమే సేంద్రియ ఎరువులు




## అన్నదాతల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం
## వినూత్న ఆగ్రోటెక్ రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోండి

**ఆళ్లగడ్డ నవంబర్ 28(రిపబ్లిక్ న్యూస్)** అన్నదాతలు నష్టపోకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్ పి లక్ష్యమని మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బిల్లా రాజేష్ యాదవ్, డిజిఎం రాజేష్ బాబు లు తెలిపారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో వినూత్న ఆగ్రోటిక్ ఎల్.ఎల్.బి వారి ఆధ్వర్యంలో రైతు సోదరులకు సేంద్రియ ఎరువులు, సేంద్రియ వ్యవసాయంపైఅవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ అన్నదాతలు రేయి, పగలు శ్రమించి అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టి పంటల దిగుబడులు రావాలని కోరుకుంటారన్నారు. కానీ రసాయన ఎరువుల ద్వారా అనుకున్న స్థాయిలో అధిక దిగుబడులు సాధించడం కష్టమన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమిలో భూసారం పెరిగి పంటలు అధిగ దిగుబడులు వస్తాయన్నారు. తద్వారా రైతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు."వినూత్న ఆగ్రో టెక్ ఎల్.ఎల్.పి" సంస్థ రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ , టర్బో కే జి ఎఫ్6, రోషిని, ఉజ్వల్ , త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృధ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సం?రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తున్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో ఎమ్మెల్యే దంపతులు పూజలు

**మహానంది, నవంబరు28,(రిపబ్లిక్ న్యూస్):** మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీశైలనియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, శైలజ దంపతులు పూజలు నిర్వహించారు. గురువారం స్వామివార్ల దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి,వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు.అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి అభిషేకార్చన పూజలను నిర్వహించారు.పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులురవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారామ్ బట్, హనుమంతు శర్మ, ఆంజనేయ శర్మలు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులుశ్రీశైలనియోజక వర్గం సమన్వయ కర్త బన్నురు. రామలింగారెడ్డి,మహానంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సీతారామాపురం శ్రీనివాసరెడ్డి,మహానంది మాజీ చైర్మన్ లు సురేష్ రెడ్డి, పాణ్యం ప్రసాద్, నరాల మౌళీశ్వర రెడ్డి, కంచర్ల శివ, గడ్డం నాగపులయ్య, గంగిశెట్టి మల్లికార్జున, రామచంద్రుడు,మాజీ సర్పంచ్ రాముడు, గాజులపల్లి రవిస్వామి, మహేశ్వర రెడ్డి, కిట్టు,నందిపల్లి మహేశ్వర రెడ్డి,గని చిన్న రంగస్వామి, మారెడ్డి సుబ్రహ్మణ్యం, అనిమేల శివ, ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# విద్యతోనే మంచి భవిష్యత్తు... జిల్లా విద్యాశాఖ అధికారి



**మహానంది, నవంబరు28,(రిపబ్లిక్ న్యూస్):** విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు.గురువారం మహానంది మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శ్రద్ధతో చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఉపాధ్యాయులు పాఠశాల సమయాన్ని పాటించాలని కోరారు.గుడ్లు, చెక్కి లను పరిశీలించారు. ఆయన వెంట ఎం ఈఓ రామసుబయ్య, ఎం ఆర్ పి తిమ్మయ్య, తదితరులు ఉన్నారు.

# బెల్టు షాపులపై మహానంది పోలీసుల దాడులు

**మహానంది,నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** మహానంది మండలంలోని బెల్ట్ షాపులపై మహానంది పోలీసులు దాడులు నిర్వహించినట్లు విశ్వాసనీయ సమాచారం. బొల్లవరం గ్రామానికి చెందిన ఒక బెల్ట్ షాపు నిర్వాహకుడు నుండి దాదాపు 30 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. గత మూడు నాలుగు రోజుల క్రితం బొల్లవరం గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మరొక ముందే స్థానిక పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహించి మద్యం బాటిలను స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎక్సైజ్ పోలీసులు బెల్టు షాప్ నిర్వాహకులపై దాడులు నిర్వహించి స్టేషన్లో బెయిల్ మంజూరు చేయడంతో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వ్యాప్తి చెందుతున్నట్లు సమాచారం.

# కామేశ్వరి అమ్మవారికి బంగారు పూత కిరీటం బహూకరణ



**మహానంది,నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవిఅమ్మవారికి రూ.2.25 లక్షల బంగారు పూత గల కిరీటాన్ని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన భరత్ కుమార్ రెడ్డి, అనిత దంపతులు భక్తితో అందజేశారు. గురువారం స్వామి అమ్మవార్ల దర్శనార్థమే వచ్చిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా, ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి కి అందజేశారు. ఈవో దాతలను అభినందించి, స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

# నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా పోలీస్ అధికారిగా పనిచేసిన రఘువీర్ రెడ్డి



ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు... ఎన్నికల ముందు జరిగిన కొన్ని సంఘటనల వల్ల జిల్లా ఎస్పీగా ఉన్న రఘువీర్ రెడ్డిని ఎన్నికల అనంతరం రాష్ట్ర పోలీస్ ముఖ్య అధికారి కార్యాలయానికి బదిలీ చేశారు.. ప్రతి ఉద్యోగి ఉద్యోగంలో చేరిన రోజు కంటే పదవీ విరమణ రోజు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది . తోటి ఉద్యోగులు పై స్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బంది స్నేహితులు అలాగే బంధువులు ఇలా అందరూ ఆ ఉద్యోగి పదవి విరమణ రోజున జరిగే కార్యక్రమంలో పాల్గొని ఘనంగా వీడ్కోలు పలకడం చూస్తుంటాం... చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంలో అనంతపురం మరియు కర్నూలు జిల్లా పోలీసు అధికారులు చేయని సాహసం నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అప్పటి ఉన్నత అధికారులు మరియు ఉన్నత నాయకుల ఆదేశాల మేరకు ఎంతో సాహసోపేతంగా విధి నిర్వహణ చేసి నంద్యాలలో చంద్రబాబు అరెస్టు లో ముఖ్యపాత్ర పోషించాడని పేరు తెచ్చుకున్నారు... ఏ అధికారి అయిన అధికారంలో ఉన్న ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు నాయకుల సూచనల మేరకు విధులు నిర్వహించాల్సిందే... నాయకులు తప్పించుకోవడం అధికారులు బలి కావడం జరుగుతూ ఉంటుంది.. ప్రస్తుతం ఉన్న పాలకులు రఘువీర్ రెడ్డి పోలీస్ శాఖ లో చేరినప్పటి నుండి నేటి వరకు ఆయన పనితీరును గమనించి పదవీ విరమణ ఒకరోజు గడువు ఉండగానే పోస్టింగ్ ఇచ్చి గౌరవప్రదంగా ఆయనను పదవీ విరమణ చేసేలాగా చేస్తారని కోరుకుందాం.. నంద్యాలలో జరిగిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం రోజున సినిమా హీరో అల్లు అర్జున్ అదే రోజు అదే సమయానికి నంద్యాలకు వచ్చి వైఎస్ఆర్సిపి అభ్యర్థి శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి గెలుపు కోసం మద్దతు ప్రకటించడం జరిగింది... ఈ సంఘటనలన్నీ రఘువీ రెడ్డి నంద్యాల నుండి బదిలీ అయ్యేందుకు దోహదపడ్డాయి... చలం బాబు అధ్యక్షులు ఎలక్ట్రాన్ మీడియా అసోసియేషన్ నంద్యాల జిల్లా

# బాల్య వివాహాలను అరికట్టాలి

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి



**ఆళ్లగడ్డ నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్)** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆళ్లగడ్డ రూరల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి పిలుపునిచ్చారు. గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణంలో సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలోఅంగన్వాడి కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు అనేవి ఒక సాంఘిక దురాచారమని పేర్కొన్నారు. గ్రామాలలో ఎక్కడైనా బాల్యవివాహాల సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే ఐసిడిఎస్ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు.బాల్యవివాహాలు చేసుకోవడం వలన ఎన్నోఅనార్థాలకు దారితీస్తుందన్నారు. బాల్య వివాహాలు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసుకుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.బాలికలకు విద్యా,భద్రత, తదితర వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మీదేవి తోపాటు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నందీశ్వర పూజ

**మహానంది, నవంబరు28,(రిపబ్లిక్ న్యూస్ ):** మహానంది పుణ్యక్షేత్రంలో నందీశ్వర పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నందీశ్వరునికి వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారామ్ బట్, హనుమంతు శర్మ, ఆంజనేయ శర్మలు పాలాభిషేకం, సుఘందాబి షేకం,ఘందాబి షేకం,షోడోషోపచార పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఓంకార క్షేత్రంలో ప్రముఖుల ప్రత్యేక పూజలు



## వేరువేరుగా స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే దంపతులు

**బండి ఆత్మకూరు,నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):–** నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారి వెలసిన ఓంకార క్షేత్రంలో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా క్షేత్రానికి చేరుకొని స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.జిల్లా కలెక్టర్ క్షేత్రానికి చేరుకోగానే తహసిల్దార్ ధోని అల్ఫ్రెడ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగ ప్రసాద్ ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున శర్మలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.పూజల అనంతరం జిల్లా కలెక్టర్ కి వేదమంత్రాలు చారణలతో ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.



**ఓంకార క్షేత్రంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు**


శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓంకార సిద్దేశ్వర స్వామి,ఉమాదేవి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే క్షేత్రానికి చేరుకోగానే టిడిపి నాయకులు మల్లేశ్వర రెడ్డి,మనోహర్ చౌదరి,శంకర్ రెడ్డి,అల్లె చెన్నారెడ్డి,అల్లే ఈశ్వర రెడ్డిలతో పాటు ఇతర టిడిపి నాయకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు.ఆలయ కార్యనిర్వహణాధికారి నాగప్రసాద్ మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తర్వాత శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లి ఆయన అక్కడ అన్నపూర్ణాదేవిని దర్శించుకున్నారు.ఆశ్రమంలో భక్తులకు ఎమ్మెల్యే దంపతులు స్వయంగా భోజనాలు వడ్డించారు.ఈ క్రమంలో ఓంకార క్షేత్రంలో నివాసాలు ఉన్న పలువురు స్థానికులు క్షేత్రంలో చాలా ఏళ్లుగా నివాసం ఉన్నామని తమకు నివాస ధ్రువీకరణ పత్రాలు ఇప్పించవలసిందిగా ఎమ్మెల్యేను కోరారు.వారితోపాటు పలువురు గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో గిరిజన గూడెలు సందర్శించి గిరిజనులకు అవసరమైన అన్ని రకాల వసతి సదుపాయాలు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.క్షేత్రంలో నివాసం ఉన్న వారి విషయమై రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు.ఆయన వెంట టిడిపి నాయకులు సిద్ధం ప్రతాపరెడ్డి,పిట్టం రామకృష్ణారెడ్డి,జాకీర్ ఖాన్, తోట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

## బీసీలకు మంచి రోజులొచ్చాయి : నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల నవంబర్ 28 ( రిపబ్లిక్ న్యూస్):**
బలహీనవర్గాల వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా , బీసీల అభివృద్ధి లక్ష్యంగా జ్యోతిరావు పూలే గారు పనిచేశారని అంటరానితన నిర్మూలన , మహిళల అభివృద్ధి లక్ష్యంగా జ్యోతిరావు పూలే గారు తమ సేవలను అందించారని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ కొనియాడారు . ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నంద్యాల స్థానిక పద్మావతి నగర్ ఆర్చి దగ్గర ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో బీసీలకు మంచి రోజులు ప్రారంభమయ్యాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 5 నెలల కాలంలోనే బీసీల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. ఏపీ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో రూ.39 వేల కోట్లను సీఎం చంద్రబాబు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం బీసీ బిడ్డలకు బకాయి పడిన డైట్, కాస్మోటిక్ బిల్లులు చెల్లించామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంజేపీ స్కూళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించామన్నారు. నూతనంగా ఎంజేపీ స్కూళ్ల నిర్మాణాలకు సీఎం చంద్రబాబు నిధులు కూడా మంజూరు చేశారన్నారు. మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న బీసీ అభ్యర్థుల కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో అన్ని జిల్లాలోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. త్వరలో ఆన్ లైన్ లోనూ ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు ఎన్ఎండి ఫిరోజ్ వెల్లడించారు. సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమయ్యే బీసీ అభ్యర్థుల కోసం త్వరలో శిక్షణా తరగతులు ప్రారంభించబోతున్నామన్నారు. బీసీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎంఎస్ఎంఈ, ఏపీ ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో పాటు బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు కూడా అందించనున్నట్లు ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. బీసీ అభ్యున్నతి కోసం ఒక వైపు విద్యకు, మరోవైపు పోటీ



పరీక్షలకు సిద్ధమయ్యేవారికి శిక్షణ, ఇంకో వైపు ఆర్థిక చేయూత కలిగేలా స్వయం ఉపాధి పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , త్రిలింగేశ్వర్ రెడ్డి , షేక్ మున్నా , ఇసుక చాంద్ , నాగేశ్వరరావు , దస్తగిరి , సుధాకర్ , కాజా , మధు సాయి , హుస్సేన్ మరియు పలువురు బీసీ నాయకులు మరియు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే.

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

**కర్నూలు, నవంబరు 28, రిపబ్లిక్ న్యూస్ :**
అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.

గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా బిర్లా గేట్ కూడలి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గారు అణగారిన వర్గాల అభ్యున్నతికి,సామాజిక అంతరాలను తొలగించేందుకు ఎంతో కృషి చేశారన్నారు.



సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించి, 1848 ఆగస్టులో బాలికలకు పాఠశాల స్థాపించి స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. 1873 సెప్టెంబరు 24న పూలే తన అనుచరులతో కలిసి అణగారిన వర్గాల ప్రజలకు సమాన హక్కులు పొందటానికి సత్య శోధక్ సమాజాన్ని పూలే స్థాపించారన్నారు.. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన జ్యోతిరావ్ పూలే మానవ హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు.. అట్టడుగు, బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన వ్యక్తి పూలే అన్నారు. జ్యోతిరావు పూలే ను స్ఫూర్తిగా తీసుకుని, వారి ఆశయాలను అనుసరించి ఉన్నత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బిసి సంఘం అధ్యక్షుడు నక్కల మిట్ట శ్రీనివాసులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలి.



**వెలుగోడు నవంబర్ 28 రిపబ్లిక్ న్యూస్** రాష్ట్రంలోని బీసీలందరి సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా వెలుగోడు పట్టణంలోని వేంపేట సర్కిల్లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే బాలికల విద్య కోసం, సమ సమాజ స్థాపన కోసము, అంటరానితనం నిర్మూలన కోసము కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వము బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుకు కృషి చేస్తున్నదని , బీసీలకు 33 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థలలో కల్పించుటకు కృషి చేస్తున్నదని కొనియాడారు. వారు మాట్లాడుతూ బీసీలకు చట్టసభలలో జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని , జిల్లా కేంద్రాలలో, నియోజకవర్గ కేంద్రంలో బీసీ భవన్ లను ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలో కూడా బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు,టిడిపి నాయకులు అంకన్న, నాగన్న , భాస్కర్ గౌడ్, రాందాసు , రాజ లింగయ్య యాదవ్ , గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బాల అకాడమీ విద్యా సంస్థలలో క్యాన్సర్ అవగాహన సదస్సు



**నంద్యాల నవంబర్ 28 ( రిపబ్లిక్ న్యూస్):** నేటి మానవ జీవంలో మనం ఎదుర్కొంటున్న ప్రధాన అర్యోగ్య సమస్య క్యాన్సర్. ఈక్యాన్సర్ పై అవగాహన ఉండటం తప్పనిసరి. ఈ సద్దుద్దేశంతో నంద్యాల రోటరీ క్లబ్ వారు బాల అకాడమీ విద్యాసంస్థ యందు గురువారం క్యాన్సర్ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ గీతావాణి , మెడికల్ రేడియేషన్ యాంకాలజిస్ట్ డాక్టర్ సుస్మిత పాల్గొని మహిళలు ఎదుర్కొనే సర్వైకల్ క్యాన్సర్ పై అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించ వలసిన నియమాలు, సలహాలు సూచనలు వ్యాక్సిన్ వివరాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేసారు, ఈ సదస్సులో బాల అకాడమీ కరెస్పాండెంట్ %వీ.+.ఎ% రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత ,రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ %చీ%.మోహన్ రెడ్డి , మాజీ అసిస్టెంట్ గవర్నర్ కైలాసనాద్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ %ం%.ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని, వారి అమూల్యమైన సందేశాలను ఇవ్వడం జరిగింది.

## రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

**- జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ**



**బండి ఆత్మకూరు, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):–** రైతు సోదరులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకం తగ్గించి అధిక నికర లాభాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు.గురువారం ఆయన మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి స్వాతి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు రైతుల సాగు చేస్తున్న విధానంపై వ్యవసాయ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు,సాగులో రసాయనిక ఎరువుల వాడకం వంటి వివరాలతో పాటు పంటల దిగుబడి లాభనష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా భూముల వివరాలు,భూసార పరీక్షలు,భూమి హెల్త్ కార్డులు ఆధారంగా చేసుకుని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించే విధంగా రైతులను అవగాహన పరచాలన్నారు. అలాగే భూమి ఖాళీగా ఉండకుండా అపరాలను సాగు చేసే విధంగా రైతులకు సూచించాలని ఆయన వ్యవసాయ సిబ్బందికి సూచించారు.అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు.రైతులు కోత చేసిన వరి ధాన్యాన్ని తేమశాతం పరిశీలించి విత్తనాలను సేకరించడం జరిగింది.అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర రూ 2300 క్వింటాలకు మద్దతు ధర ఉన్నదని తేమశాతం 18 శాతం ఉండాలని రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టి అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి తెలియజేశామని చెప్పారు.త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.రైతులు లాబాసాటిగా ఉన్న వ్యవసాయాన్ని చేయాలని కోరారు.భూమిని ఖాళీగా ఉంచరాదని అపరాలను సాగు చేయాలని మినుములే కాకుండా పెసలు కూడా సాగు చేయాలని ఆయన తెలియజేశారు.రసాయనిక ఎరువులు వాడకాన్ని క్రిమిసంహారకమందులు వాడ కానీ తగ్గించి నికర లాభం పొందేలా రైతు సోదరులు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు రైతు సోదరులు పాల్గొన్నారు.

## 27వ తేదీన పాములపాడులో జరిగిన అంగన్వాడి కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవానికి ఎంపీ- డాక్టర్ బైరెడ్డి శబరి కి పిలవకపోవడం, శిలాఫలకంలో ఎంపీడీవో, కాంట్రాక్టర్ పేరు లేకపోవడం చాలా బాధాకరం

## పాములపాడు మండలం సీనియర్ నాయకులు కే.ఎల్లయ్య, జిఎం.రవి, ఎం.వీరారెడ్డి, కే.బాలస్వామి




**పాములపాడు నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్):**–నందికొట్కూరు నియోజకవర్గంలోని, పాములపాడు మండల కేంద్రంలోనీ, ఎస్సీ కాలనీలో 27వ తేదీన జరిగిన అంగన్వాడి కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ డాక్టర్.బైరెడ్డి శబరి ని,ఆహ్వానించకపోవడం, శిలాఫలగంలో ఎంపీడీవో, కాంట్రాక్టర్ పేర్లు లేకపోవడం పాములపాడు మండల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఇది ఒక రకంగా అవమానకరంగా భావిస్తున్నామనీ మండల టిడిపి సీనియర్ నాయకులు కురువ. ఎల్లయ్య, జి.ఎం.రవి, ఎం.వీరారెడ్డి, కలబండి.బాలస్వామి, జి.వెంకటస్వామి, నాగరాజు, డి.వెంకటేశ్వర్లు, కే.శివ, తదితర నాయకులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం పని చేయని వారికి, పార్టీ కండువా వేసుకొని వారికి, పార్టీలు మారేవారికి, అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటినుంచి పార్టీకి సేవ చేసే వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా, పైరవీలు చేసే వాళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకంలో మండల డెవలప్మెంట్ ఆఫీసర్– ఎంపీడీవో పేరు లేకపోవడం అవమానకరంగా ఉందన్నారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాన్ని కట్టిన కాంట్రాక్టర్ పేరు కూడా లేకపోవడం అవమానంగా భావిస్తున్నామని అన్నారు.

## పూలే ఆశయ సాధన కోసం కృషి చేద్దాం సర్పంచ్ జయపాల్.

**వెలుగోడు నవంబర్ 28 రిపబ్లిక్ న్యూస్** మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని వెలుగోడు మేలు గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మరియు గ్రామపంచాయతీ కార్యాలయంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి శంకర్ శర్మ నరసింహులు, రామ్మోహన్ రెడ్డి, రాజేష్ ,అచ్చయ్య ,సూరి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com